# ఎఱ్ఱకార్లు

రచయిత : చిన్నబాబు

★

సుదీర్ఘమైన జీవిత వైశాల్యాన్ని కొలుస్తూ "ఫైర్అలారమ్" రింగ్‌మంది. టెలిఫోన్‌దగ్గర ఎవరో హడాహుడిగా మెసేజ్ వ్రాస్తున్నారు. ఎఱ్ఱకార్లగుండెలు బిగుసుకున్నాయి. ఎన్నో మిలిటరీ బూట్ల చప్పుడు హడావిడిగా వినిపిస్తోంది. ఆఫీసర్ కమాండింగ్‌గా ఏదో అరుస్తున్నాడు.

గుఱ్ఱంకళ్లెం పట్టుకోవటంతోటే యింటివేపుకు పరుగెత్తినట్లు, వాయువేగంగా 'ఎఱ్ఱకార్లు' బయలుదేరాయి. ఎన్నో యిళ్లు ఒక్కసారి కూలినట్లు బ్రహ్మాండమైన గంటల శబ్దంతో బయలుదేరాయి కార్లు. గంట గణగణమని వినిపిస్తూనే వుంది. కార్లు రివ్వుమని వాయువేగంగా దూసుకుపోతున్నాయి. రోడ్డుమీద జనం చెరుప్రక్కలకు దున్నుకుపోయారు. "వెంకడు" ప్రక్కనున్న AXE ను సద్దుకుంటున్నాడు. గాలి రివ్వున విసురుతూ వెంకడుజుట్టు గజిబిజిగా రేపుతోంది. గంటలు, చెవులు గింగురుమనేటట్టు వినిపిస్తూనే వున్నాయి. ఎన్నోసార్లు తను ఫైర్స్‌కి వెళ్ళాడు. ఎంతో మెప్పుగా పనిచేశాడు. తనకు ఈనాడు ఏదో ఆరాటం, భయం ఆవహిస్తోంది. వెంకడు వణకిపోతున్నాడు. తన యింటిదాకా రాలేదుకదా నిప్పు? తనభార్య కడుపుతోఉంది. ఎలా వుందో నిప్పంటుకున్నాక. నిప్పంటుకుంటే "నేను నిప్పుకు భయపడను, మా ఆయన "నిప్పుడిపార్టుమెంటు" లో పనిచేస్తుండంగా నాకేం భయం" అనుకుంటుంది నాశాయి. ఇప్పుడు నేనుండి ఏంచేయగలుగుతానో నాశాయికి. వెంకడికి ఆరాటం ఎక్కువైంది. గాలిని, భూమిని, దూసుకుపోతున్న కారు టైర్ల రివ్వుశబ్దంలో గంటలమోత మేళవించి గుండెలు బరువెక్కిస్తోంది. వెంకడుచూపు ముందుకే వుంది. అప్పుడప్పుడు ఆకాశంలోకి చూస్తున్నాడు—ఏమైనా ఎఱ్ఱటిధూళి కనిపిస్తుందేమోనని.

ఇంకా కార్లు ప్రయాణం చేస్తూనే వున్నాయి. వెనకాల రేగే ధూళిలోకి చూశాడు వెంకడు. చక్రాల వేగానికి దుమ్ము వెనక్కి తోసుకుపోయి పైకి పెనవేసుకు ఎగురుతోంది. గిరగిర తిరిగే మట్టిలో వెంకడు ప్రాణం రెప రెప కొట్టుకుంది. ఎవరో త్రోవప్రక్కమనిషి ధూళిలో మునిగిపోయి ఇటు అటు విదలించుకొంటున్నాడు. వెంకడు గుండెలు కొట్టుకుంటూనే ఉన్నాయి.

కార్లోంచి చూస్తూంటే, రామాన్క్ ఎఱ్ఱటిధూళి ఆకాశంలో స్పష్టంగా కనబడుతోంది. వెంకడు మధ్య మధ్య లేచి ముందు త్రోవ చూస్తున్నాడు. ఈసారి అందరికి మంటలు బాగా కనుపిస్తున్నాయి. మరీ దగ్గరకుపోయాయి కార్లు. పెద్దపెద్ద మంటలతోపాటు వాటికిరెట్టింపైన ఏడ్పులు వినిపిస్తున్నాయి.

కార్లు అకస్మాత్తుగ ఆగిపోయాయి. ఆఫీసర్ ఒక్క కేకవేశాడు. "Crews dismount". అందరూ హడావిడిగా దిగారు. "Set the hoses" మళ్లీ ఘర్జన వినిపించింది. వెంకడు తన యింటివేపు ఒక్కసారి చూశాడు. ఇంటిచుట్టూ ఎఱ్ఱటిమంటలు. శాయమ్మకోసం వెంకడు చూడలేదు.

అవతల ఆఫీసర్ ఆజ్ఞాపించాడు. నీళ్లగొట్టాలు వరుసగా పేర్చుకుంటూ చాలా త్వరగా, తత్తరంగా నడుస్తున్నాడు. వెఱ్ఱిఆవేశం, ఆవేదన అతణ్ణి ఎక్కువ పనిచేయిస్తోంది. ఒక్క అయిదు నిముషాల్లో రాముడు ఆరుగొట్టాలు పరచాడు. ఆఫీసర్ వెంకడికేసి దీక్షగా చూస్తున్నాడు. వెంకడు ఎండదెబ్బ బాగా తిన్నాడు. అటు నిప్పువేడి మరీ ఎక్కువగా వుంది.

ఫైర్‌లీడర్ డ్రైవర్‌తో "Pump action" అని కేకవేశాడు. దాంతో పెద్దచప్పుడుతో ఇంజన్ ప్రారంభించింది— గొట్టాలలోకి నీరు ఏకధాటిగా వస్తోంది. వెంకడు ఒక గొట్టం చివర నుంచున్నాడు. నీరు చిమ్ముకుపైకివస్తోంది. వెంకడు నిప్పుకు ప్రధానమూలంకోసం దూ సు కు పోతున్నాడు. నిప్పంతా మూడు విధాలుగా అంటుకొంది. అంటుకున్న ఇళ్లకన్నా అంటుకోకుండా ఉన్న ఇళ్ళు చాల భయంకరమైన దగ్గరగా అంటుకోటానికి సిద్ధంగా వున్నాయి. భగ భగ మండిపోతున్న ఆ యిళ్ళ మధ్యలోకి దుంకాడు వెంకడు. ఎండవేడిలో నిప్పువేడి ఏకమై వెంకడు ఉడికిపోతున్నాడు. ఒకమూల మంటలు ఘోరంగా రేగిపోతున్నాయి. చూస్తుంటే ప్రక్కనున్న యిళ్ళన్నీ ధ్వంసమయ్యేట్టుంది. ఒకప్రక్క

ఇళ్ళు తగలబడిపోయినవారి ఏడ్పులు, మరొకప్రక్క "ఇక్కడ ఆర్పండి—ఇక్కడ ఆర్పండి" అన్నవారికేకలు, ముందు ప్రళయ తాండవంచేస్తున్న అగ్నిదేవుడు, అన్నీ వెంకడిబుర్రలోదూరి గజిబిజిగా అల్లరిచేస్తున్నాయి, వెంకడు వాటికి దేనికీ లెక్కచేయలేదు. ప్రక్కనున్న ఇళ్ళు యింక అయిదు నిముషాల్లో అంటుకునేటట్లున్నాయి. వెంకడు బయటికి రావటానికి ఎక్కడా అస్కారం కనపట్టంలేదు. దూరంనించీ ఆఫీసర్ కేకలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి. పైకి చూశాడు వెంకడు. ఆఫీసర్ నోట్లోంచి వచ్చే సిగరెట్ పొగ వెంకడిని ఏదోవిధంగా పల్కరిస్తోంది. మొహం అంతా మసి అయిపోయింది వెంకడికి. వికృతాకారంగా వున్నాడు. తను వేసుకున్న యూనిఫారమ్ అంతా శుభ్రంగా తడిసి మసితో కలిసిపోయింది. ముందువెనుకలు చూడకుండా రాముడు నిప్పుమీదుగా ముందుకు దుంకాడు. అంటుకోబోతున్న ఇంటిమధ్య ఒక అస్త్రంలా నీటిప్రయోగంచేశాడు. ఆఫీసర్ చెట్టునీడనించే వెంకడ్ని మెచ్చుకుంటున్నాడు. వెంకడి ఇల్లు అప్పటికప్పడే అంటుకునేవుంది. భగ భగ మంటలు ఆకాశంలోకి లేస్తున్నాయి. కాని వెంకడు దాన్ని ఆర్పటానికి ప్రయత్నించలేదు. ప్రక్కనున్న యిండ్లకు ఎక్కడా నిప్పు తాకనీయకుండా నీళ్ళగొట్టంతో తదేకంగా నీరు విసురుతూనే వున్నాడు.

హటాత్తుగా వెనకనుండి ఆఫీసర్ కేక విపరీతమైన ఉగ్రకంఠంలో వినిపించింది వెంకడికి. వెంకడు వెంటనే వెనక్కి తిరిగి చూశాడు. పెద్దదూలం రామం తిరగగానే అతడి భుజంమీద గట్టిగా, బలంగా పడి క్రింద భూమిమీద ఒక పెద్ద పిడుగుపడ్డట్లు పడింది. వెంకడు కూలిపోయాడు. ఆఫీసర్ పెద్ద పెద్ద కేకలు పెడ్తున్నాడు. కాని రాముడు వెంటనే లేచాడు. ఆఫీసరికి భయంలేదంటూ చేయి ఊపాడు. వెంకడికి యీసారి భార్య ఒక్కసారి దృష్టిలోకి వచ్చింది. వెంకడ్లికి భుజంసలుపులో అంటుకున్న తాటాకులు పిలుస్తున్నట్లు మీద రాల్తున్నాయి. మండిపోతున్న యిండ్లకేసి చూసి వెంకడి హృదయం జగ్గుమంది. కండ్లనీరు తిరిగింది. తాను ఒక్కిందాంట్లో ఎన్నిభావాలు యిమిడి వున్నాయో. ఉద్ధృతంగా మళ్లీ పనిలోకి దుంకాడు వెంకడు. తన చేతులోంచి తీసుకొన్న నీళ్లగొట్టాన్ని మళ్ళీ ప్రక్కనున్న ఫైర్ పూస్ దగ్గరనుండి లాక్కొటానికి ప్రయత్నించి చెయ్యి నెప్పుపుట్టి తిన్నగా నిప్పయివతలకి వచ్చేశాడు. అప్పటికి నిప్పంతా చాలా తగ్గిపోయింది.

తిన్నగా చెట్టుక్రింద ఉన్న ఆఫీసర్‌దగ్గరికి పోయి Salute చేశాడు. చేసేటప్పుడు కొంచెం భుజం 'ఖరేప్' మంది. బాధతో పడిపోయాడు. ఆఫీసర్ అతడ్ని చూసి ఎందుకో విచారంగా నవ్వాడు. వెంకడ్ని చిన్నకారుదగ్గర స్ట్రెచర్‌మీద కూచోబెట్టారు. మళ్లీ వెంకడు ఆఫీసర్‌దగ్గరకు వచ్చాడు. ఒక్కసారి తనయిల్లు చూసుకోటానికి పెర్మిషన్ యివ్వమని కోరాడు ఆఫీసర్ ఒప్పుకున్నాడు.

వెంకడు గుండెలు కొట్టుకుంటూ నెమ్మదిగా శిథిలమైన యింటివేపు వెళ్ళాడు. దూరంనించే ఇంటిగుమ్మంలో కూలిపోయి ఉన్న వికృత ఆకారాన్ని చూశాడు. గుండె గుభేలుమంది. గట్టిగా అరచాడు. అక్కడ ఎవ్వరూ లేరు. చుట్టూ బోడిగోడలు మసితో తొంగిచూస్తున్నాయి. "శాయా!" గట్టిగా అరచాడు. ఆమాటకి మళ్ళీ ప్రతిధ్వనించటానికి వీలుగా లేవు ఆబోడి శిథిలగోడలు.

ఒక్కసారిగా ఆమెమీద పడ్డాడు. ముఖం పైకియెత్తి చూశాడు. ఒకప్రక్కనున్న ముఖం అంతా నల్లగా కవిలిపోయింది. మీదపడివున్న దూలాన్ని ఇవతలకు లాగివేశాడు. వెఱ్ఱివాడిలా మీదపడి గట్టిగా ఏడ్చాడు. తను కారులోవుండి చూసినప్పటి దృశ్యం జ్ఞాపకానికివచ్చింది దుమ్ములో ఎవరో మనిషి త్రోవకనబడక తబ్బిబ్బులాడింది. తనశాయి ఎంత పోరాడిందో యీమంటలతో. "జీవితంతో పోరాడిందా నా శాయి!" వెంకడు మళ్ళీ ఏడ్చాడు గట్టిగా చంటిపిల్లవానిలా అదే పనిగ ఏడ్చాడు.

వెంకడ్ని వెంటనే స్ట్రెచర్‌మీద గవర్నమెంటు హాస్పిటల్‌లో చేర్చాడు ఆఫీసర్. సరియైన ట్రీట్‌మెంట్‌కోసం స్పెషల్‌గా చెప్పాడు.

రాత్రి వెంకడికి వెఱ్ఱిజ్వరం వచ్చింది. ఆఫీసర్ వచ్చి అతడికి చాలా విధాల డబ్బు సహాయంచేస్తానని సముదాయించి చెప్పాడు. నిశ్శబ్దంగావున్న చీకటి హాస్పిటల్ వాతావరణంలో వెంకడు దూరంగా యింకొక మంచంమీదవున్న మూలాలుమూల్గు వింటున్నాడు. గోడమీదే వుంది శాయి! అది శాయి పాలిపోయిన ముఖంలోని చిరునవ్వే! నవ్వేతూ, కొంచెం కోపంగా ముందుకు వస్తోంది. వెంకడికి ముచ్చెమటలు పోసాయి చూస్తూనే వున్నాడు. చేతులో ఏదో వుందే? ఏదో ఎఱ్ఱటి మాంసపుముద్ద—వెంకడి వేడిరక్తపు సారం.

గట్టిగా బావురుమన్నాడు వెంకడు. నర్సు అతడ్ని మంచంమీద అదిమిపట్టుకుంది. ఆఫీసర్ యింకా ప్రక్కనే వున్నాడు. "నీకు ఏసహాయమైనా చేస్తాను; భయపడకు"—అంటాడు ఆఫీసర్. అతడు చూపిన సౌహార్ధహృదయానికి కృతజ్ఞత చూపేంతటి అయుస్సు కూడా లేకపోయింది వెంకడి జాతకంలో. రూమ్ తుడిచే పాకీవాడు గోడకి తగ్గిలించిన 'జ్వరమాపపట్టిక' తీసుకువెళ్ళిపోయాడు.